సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 20 । జూలై । 2025



గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం
మద్యం తాగి వ్యక్తిగత సమస్యలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బి.కొత్తకోట మండలంలో జరిగింది. -8లో



టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచితే ఆత్మహత్యలే శరణ్యం
టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచితే ఆత్మహత్యలు చేసుకుంటామని వేముల మండలం కె.కె.కొట్టాల గ్రామస్తులు అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.280	రూ.340
రెండోరకం	రూ.180	రూ.270

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 550 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

పోతన సాహితీ పీఠం అధ్యక్షుడికి ఆహ్వానం



పసుపులేటి శంకర్

ఒంటిమిట్ట: అమెరికన్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధాన వేడుకలకు ఒంటిమిట్ట పోతన సాహితీ పీఠం అధ్యక్షుడు పసుపులేటి శంకర్‌ని విశ్వవిద్యాలయం వారు శనివారం ఆహ్వానించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనపరచిన వారికి గౌరవ డాక్టరేట్, జీవిత సాఫల్య పురస్కారాలను పాండిచ్చేరిలో ఈనెల 27న అందజేయనున్నారని ఒంటిమిట్ట పోతన సాహితీ పీఠం అధ్యక్షుడు పసుపులేటి శంకర్ తెలిపారు.

కోదండ రామయ్యకు స్నపన తిరుమంజనం



స్వామి వారికి పట్టువస్త్రాలు, పుష్పమాలికలు తీసుకొస్తున్న టీటీడీ అధికారులు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శనివారం స్వామి వారికి వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్నపన తిరుమంజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో సుప్రభాత సమయాన శ్రీరామచంద్రమూర్తికి పట్టు వస్త్రాలు, పుష్పాలు, ఫలాలు, అభిషేక సామగ్రి సమర్పించారు. గర్భాలయంలో సీతా రామలక్ష్మణ మూర్తులకు అభిషేకాలు చేసి, పట్టువస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో ముస్తాబు చేశారు. అనంతరం ఆలయ పండితులు వేద పారాయణం, సహస్ర నామార్చన, కుంకుమార్చన, మంగళహారతులతో విశేష పూజలు నిర్వహించారు.

జేఎన్టీయూ హాస్టల్ సాంబారులో బల్లి



విద్యార్థిని ప్లేటులో ఉన్న బల్లి

కలికిరి: జేఎన్టీయూ బాలికల వసతి గృహం హాస్టల్‌లో శనివారం ఉదయం విద్యార్థినులు తింటున్న ఇడ్లీ, సాంబార్‌లో బల్లి ప్రత్యక్షమైంది. దీంతో విద్యార్థినులు ఒక్క సారిగా ఆందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు అక్కడికి వచ్చారు. బల్లి విద్యార్థిని ప్లేటులో మాత్రమే పడిందని ఆయన తెలిపారు. అర్ధగంట తరువాత విద్యార్థినులకు టిఫిన్ ఏర్పాటు చేయించారు. పరిసరాల పరిశుభ్రత పాటించక పోవడంతోనే ఈ ఘటన చోటు చేసుకుందని హాస్టల్ నిర్వాహకులపై ప్రిన్సిపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోమారు ఇలాంటివి జరగకుండా జాగ్రత్త పడాలని పేర్కొన్నారు. ఇది వరకే పలుమార్లు హాస్టల్ నిర్వహణపై ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని విద్యార్థినులు ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకువచ్చారు.

సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ సి.శ్రీధర్

రాయచోటి: సంక్షేమ వసతి గృహాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదేశించారు. శనివారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి జిల్లా సాంఘిక వెనుకబడిన తరగతుల గిరిజన, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు, నియోజకవర్గాల, మండలాల ప్రత్యేక అధికారులతో జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో ఉన్న వసతులు తదితర అంశాల తనిఖీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 156 సంక్షేమ హాస్టళ్లు, 2176 సంక్షేమ పాఠశాలలను నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. నీటి వసతి, మరుగుదొడ్లు, భోజనం తయారీ విధానం తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఇప్పటికే తనిఖీ చేసిన హాస్టళ్లు, పాఠశాలలపై నివేదికలను సంబంధిత సంక్షేమ శాఖ అధికారులకు అందజేయాలన్నారు. కొన్ని హాస్టళ్లు, పాఠశాలల్లో ఆర్‌ఓ ప్లాంట్లు పని చేయకపోతే పునరుద్ధరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య డ్యాం



ఆదిలోనే జాప్యం

- కొనసా..గుతున్న నమూనా రూపకల్పన
- జలాశయం బండ్ తెగి నాలుగేళ్లు
- పునర్నిర్మాణానికి చర్యలు
- నిపుణుల బృందం పలుసార్లు పరిశీలన
- తేలని డిజైన్



అన్నమయ్య డ్యాం

రాజంపేట: అన్నమయ్య డ్యాం డిజైన్ ఇప్పట్లో తేలేటట్లు కనిపించడం లేదు. ఒకప్పుడు కాంక్రీట్ డ్యాం నిర్మించాలనుకున్నారు. ఇప్పుడు రాక్‌ఫిల్ డ్యాం నిర్మించాలనే ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ప్రధానంగా ఎంతటి వరద వచ్చినా తట్టుకునేలా డ్యాం పునఃనిర్మాణం చేపట్టాలని.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్ణయం తీసుకొని అధునాతనమైన డిజైన్‌ను తీసుకొచ్చారు. ఇప్పుడు ఈ ప్రభుత్వంలో ఏ డిజైన్ తీసుకొస్తారో అన్నది చర్చనీయాంశంగా మారింది.

గత టీడీపీ పాలనలో అదనపు స్పిల్‌వే నిర్మించకపోవడంతోనే..

చెయ్యేరు నదిపై 2.24 టీఎంసీల సామర్థ్యంతోనే అన్నమయ్య ప్రాజెక్టును 1981లో ప్రారంభించగా, 2001లో పూర్తి చేశారు. 206.65 మీటర్ల ఎత్తుతో 94 మీటర్ల పొడవు స్పిల్‌వే, అనుబంధంగా 336 మీటర్ల పొడవు మట్టికట్ట నిర్మించారు. స్పిల్‌వేకు 13.75 మీటర్ల పొడవున మట్టికట్ట నిర్మించారు. స్పిల్‌వేకు 13.75 మీటర్ల ఎత్తు, 14 మీటర్ల వెడల్పుతో ఐదుగేట్లు అమర్చారు. ఈ ప్రాజెక్టు కింద 22.500 ఎకరాల ఆయకట్టు ఉంది. 2012లో జలవనరుల శాఖ 3–డీ అధ్యయనంలో అన్నమయ్య డ్యాం స్పిల్ వే నుంచి.. గరిష్టంగా 2.17 లక్షల క్యూసెక్కులే దిగువకు విడుదల చేయవచ్చునని తెలిపింది. 2017లో ప్రాజెక్టును తనిఖీ చేసిన డ్యామ్ సేఫ్టీ కమిటీ 1.30 లక్షల క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేసేలా అదనంగా మరో స్పిల్‌వే నిర్మించాలని ఇచ్చిన నివేదికను.. అప్పటి టీడీపీ సర్కారు పట్టించుకోలేదు. ఫలితంగా నాలుగేళ్ల క్రితం వచ్చిన భారీ వరదతో మట్టికట్ట కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే.

3.2 లక్షల క్యూసెక్కుల వరద నీటితో..

2021 నవంబరు 19న అన్నమయ్య జలాశయంలో ఉదయం 5.30 గంటలకు 3.2 లక్షల క్యూసెక్కుల వరదనీటి ఉధృతితో.. బండ్ తెగిపోయి పరీవాహక పల్లెలను ముంచెత్తిన సంఘటన తెలిసిందే. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పటిష్టమైన చర్యలకు దిగింది. ఇందులో భాగంగా జలాశయం పునఃనిర్మాణంలో స్పిల్‌వే సామర్థ్యం పెంపు కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వంలో నిర్ణయం తీసుకున్నారు. 2.242 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ఉన్న జలాశయం రూపురేఖలు మార్చారు.

8 లక్షల 22 వేల క్యూసెక్కుల సామర్థ్యం

జలాశయాన్ని 8 లక్షల 22 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసే సామర్థ్యం కలిగే డిజైన్ రూపొందించనున్నారు. హైడ్రాలజీ అధ్యయనం పూర్తి చేసుకున్న అనంతరం నిర్ణయం తీసుకున్నారు. వరదనీటిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర జల వనరుల సంఘం సిఫార్సు చేసింది. ఆ మేరకు సామర్థ్యంపై గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో ఎంతటి ఉపద్రవం వచ్చినా.. తట్టుకునేలా జలాశయం నిర్మాణానికి రూపకల్పన ముమ్మరంగా జరిగింది. ఇందుకోసం వివిధ రకాల భూగర్భ పరీక్షలు, హైడ్రాలజీ అధ్యయనాలు జలాశయంలో కొనసాగాయి.

గేట్ల సంఖ్య పెరిగే అవకాశాలు



ప్రస్తుతం జలాశయంలో ఐదు గేట్లు ఉన్నాయి. స్పిల్‌వే సామర్థ్యం 8 లక్షల 22 వేల క్యూసెక్కులు పెంచుతున్న నేపథ్యంలో.. గేట్ల సంఖ్య కూడా పెరిగే పరిస్థితులు ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం 1 లక్ష 80 వేల క్యూసెక్కులు నీటిని దిగువకు విడుదల చేసే సామర్థ్యం కలిగి ఉంది.


గత వరద ఉధృతి పరిశీలించాక..

అన్నమయ్య ప్రాజెక్టు నిర్మించిన 50 ఏళ్ల తర్వాత (2021లో) తొలిసారిగా భారీ వరదపోటును తట్టుకోలేకపోయింది. గతంలో మూడు సార్లు జరిగిన ఘటనలు, 16 ఏళ్లలో మూడుసార్లు భారీగా వరదలు రావడం, ప్రతిసారి సామర్థ్యానికి మించి నీటిని విడుదల చేసిన లెక్కలను.. సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ నిపుణుల బృందం పరిశీలించిన సంగతి తెలిసిందే.

తెరపైకి రాక్‌ఫిల్ డ్యాం

ఆసియా ఖండంలోనే రెండు గ్యాలరీలతో నిర్మితమైన అన్నమయ్య జలాశయం.. పునఃనిర్మాణ పనులు మార్చుకునే దిశగా అడుగులు పడ్డాయి. నదీ గర్భంలో 40 మీటర్ల వరకు ఇసుక ఉన్న నేపథ్యంలో.. కాంక్రీట్ డ్యాం తట్టుకుంటుందా అనే సందేహాలు ఇరిగేషన్ వర్గాల్లో తలెత్తాయి. ఫలితంగా రాక్‌ఫిల్ డ్యాం విషయాన్ని కూడా సీడబ్ల్యూసీ దృష్టికి తీసుకెళ్లారు.

సీడబ్ల్యూసీ చెంతలో..



ఇప్పటికే సీడబ్ల్యూసీ చెంతకు రెండు డిజైన్లు చేరుకున్నాయి. గతంలో జలవనరుల శాఖ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్‌యాదవ్, కడప ఎస్ఈ శ్రీనివాస్, రాజంపేట ఈఈ రవికిరణ్‌లు సీడబ్ల్యూసీ, పూణెలో సెంట్రల్ వాటర్ రిసోర్స్ పవర్ స్టేషన్‌లకు వెళ్లి పరిశీలించి వచ్చారు. డ్యాం రక్షణ దృష్ట్యా ఏ డిజైన్ అనుకూలంగా ఉంటుందో అనేది త్వరలోనే సీడబ్ల్యూసీ వెల్లడించనున్నది. నదీ గర్భంలో ఇసుక 40 మీటర్ల మేర లోతు వరకు ఉండటంతో.. రెండు డిజైన్‌లలో ఏ డిజైన్‌కు సీడబ్ల్యూసీ మొగ్గుచూపుతుందో వేచి చూడాల్సిందే. కాంక్రీట్ డ్యాం వరకు తీసుకుంటే 21 గేట్లు వస్తాయి, కొత్తగా తెరపైకి వచ్చిన డిజైన్ రాక్‌ఫిల్ డ్యాం అయితే, అదనంగా స్పిల్‌వే నిర్మించి 9 గేట్లను ఏర్పాటు చేసే దిశగా డిజైన్లు రూపొందించారు.

ఈ బృందం ఏమి చెబుతుందో..

అన్నమయ్య జలాశయాన్ని నిపుణుల బృందం ఈ నెల 13న పరిశీలించింది. ఈ బృందం ప్రధానంగా జలాశయం ప్రస్తుత స్థితి గతులపై అంచనా వేసింది. అన్నమయ్య జలాశయంను నిపుణుల బృందం ఆదివారం పరిశీలించింది. ఈ బృందంలో... ప్రధానంగా జలాశయం ప్రస్తుత స్థితి గతులపై బృందం అంచనా వేసింది. ఈ బృందంలో డిజైన్ ఎక్స్‌పర్ట్‌గా పీపీఏ చీఫ్ ఇంజినీర్ రమేష్‌కుమార్, హైడ్రో మెకానికల్ ఎక్స్‌పర్ట్‌గా రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ కె.సత్యనారాయణ, జియాలజిస్టుగా జీఎస్ఐ డైరెక్టర్ జనరల్(రిటైర్డ్) ఎం.రాజు, డిజైన్ అప్రూవింగ్ అథారిటీగా సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్, డబ్ల్యూఆర్‌డీ చీఫ్ ఇంజినీరు, హైడ్రాలజీ ఎక్స్‌పర్ట్‌గా విజయవాడకు చెందిన హైడ్రాలజీ చీఫ్ ఇంజినీరు, కన్వీనర్‌గా కడప డబ్ల్యూఆర్‌డీ చీఫ్ ఇంజినీర్ ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య జలాశయం డిజైన్ చేసేందుకు సాంకేతిక నిపుణుల బృందాన్ని పంపించింది. అన్నమయ్య జలాశయం పునఃనిర్మాణానికి సంబంధించి డిజైన్, నిర్మాణం, పునరుద్ధరణ చర్యలు తదితర అంశాలపై టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ దృష్టి సారించింది. ఈ బృందం ఏమి చెబుతుందో అనే అంశంపై ఆసక్తి నెలకొంది.



పరిశీలిస్తున్న సాంకేతిక నిపుణులు (ఫైల్)

రాజకీయ కుట్రతోనే కక్ష సాధింపు

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



రాయచోటి: ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టు ప్రజాస్వామ్యానికి చీకటి రోజని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ కేసు పూర్తిగా రాజకీయ కక్షతో పెట్టిన కేసు అని విమర్శించారు. మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేసి ఆనంద పడుతున్నారేమో కానీ... ఇది నిలబడే కేసు కాదన్నారు. కూటమి కుట్రలో భాగంగానే మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారన్నారు. నారా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగానే వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. అధికారంలోకి రావడానికి కూటమి ఎన్నో తప్పుడు వాగ్దానాలు చేసిందని, ఆ వాగ్దానాలను నిలబెట్టుకోలేకపోయిందన్నారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత రావడంతో తప్పుడు కేసులు పెట్టడం మొదలు పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 14 నెలలు గడుస్తున్నా.. ఇంత వరకు ఏ ఒక్క సంక్షేమ కార్యక్రమం పైన దృష్టి పెట్టకుండా ప్రతిపక్ష పార్టీ నాయకులను వేధించమే పనిగా పెట్టుకున్నారన్నారు. తప్పుడు కేసులు, అరెస్టులకు భయపడేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

లిక్కర్ కేసు.. అంకెల ఆట..

లిక్కర్ కేసులో మొదటగా రూ.50 వేల కోట్ల అవినీతి జరిగిందని పేర్కొన్నారన్నారు. తరువాత రూ.30 వేల కోట్లు, మూడోసారి రూ.18 వేల కోట్లు అవినీతి జరిగిపోయిందన్నారు. తూచ్ మరలా రూ.3 వేల కోట్లు కాదు కాదని ఇప్పుడేమో రూ.2 వేల కోట్లు అవినీతి జరిగిందంటూ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. లిక్కర్ కేసులో ఎటువంటి సంబంధం లేని కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయరెడ్డిలను పన్నాగం ప్రకారం కేసులో ఇరికించి భయాందోళనలకు గురి చేశారన్నారు. ప్రజల్లో వైఎస్సార్‌సీపీ ఖ్యాతి దెబ్బతీసే కుట్రపూరిత వ్యవహారంలో భాగంగానే నేడు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై కేసులు నమోదు చేశారన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అక్రమం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి: రాజకీయ కుట్రలతో వైఎస్సార్‌సీపీ నేతలపై పెడుతున్న కేసులు.. ప్రజాస్వామ్య విలువలకు ముప్పు అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి పట్టణం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై నమోదు చేసిన అక్రమ కేసులను ఖండించారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ.. వారికి నచ్చని వారిపై పథకం ప్రకారం కేసులు పెట్టుకుంటూ వస్తున్నారన్నారు. అందులో భాగంగా రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారని విమర్శించారు. ఎన్నికలు అయిన మరుసటిరోజు నుంచే వేటాడుతున్నట్టుగా.. రాజకీయ పరమైనటువంటి కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా పెద్దిరెడ్డి కుటుంబాన్ని టార్గెట్ చేశారని, రాజకీయంగా ఎదుర్కోలేక అధికారాన్ని అడ్డుపెట్టుకొని తప్పుడు కేసులు పెట్టారని పేర్కొన్నారు. వాటిని రుజువు చేయలేక అభాసు పాలవుతారని ఎద్దేవా చేశారు. మదనపల్లి ఆర్డీఓ ఆఫీసు అగ్ని ప్రమాదంలో పెద్దిరెడ్డి హస్తం ఉందని ఆరోపించారని, దాన్ని నిరూపణ చేయని విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

చంద్రబాబు కేసులను విచారణ చేయించాలి

చంద్రబాబు నాయుడు ఎన్నో కేసులలో స్టేలు తెచ్చుకున్నారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసు, లిక్కర్ కేసు, 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు చేసిన అవినీతిపైన కేసులున్నాయన్నారు. చంద్రబాబు నిజంగా సచ్చీలుడి అయితే తనపై వచ్చిన కేసులపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించుకోవాలని సూచించారు. గతంలో కూడా తమ పార్టీ వారిపై తప్పుడు కేసులు పెట్టారని, ఏమీ నిరూపణ చేయలేకపోయారన్నారు. రాజంపేట నుంచి మూడుసార్లు అత్యధిక మెజార్టీతో ఎంపీగా ఎన్నికైనటువంటి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని.. ప్రజల వద్దకు వెళ్లనీయకూడదన్న ఉద్దేశంతో ఏడాది నుంచి వ్యక్తిగతంగా టార్గెట్ చేశారన్నారు.

మిథున్‌కు మద్దతుగా నిలుస్తాం

ఎంపీ మిథున్‌రెడ్డిని రాజకీయ కుంట్రలో భాగంగా లిక్కర్ కేసులో ఇరికించారన్నారు. ప్రజల్లో విలువ, ఆదరణను దెబ్బతీయాన్న ఉద్దేశంతో తప్పుడు కేసులో ఇరికించారని పేర్కొన్నారు. ఈ కుట్రలకు మిథురెడ్డి భయపడే వ్యక్తి కాదన్నారు. మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు ప్రజలు, పార్టీని నమ్ముకున్న వ్యక్తులన్నారు. వారికి తాము అన్ని రకాలుగా సంఘీభావంగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లపు రమేష్, సర్పంచ్ దండు నాగభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై ఫీవార్



సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

పల్లె.. పట్టణం అనే తేడా లేదు.. చిన్నా పెద్దా తారతమ్యం అసలే లేదు.. గడపకొకరు అనారోగ్యంతో బాధపడుతున్నారు. జ్వరమో.. ఒళ్లునొప్పులో.. జలుబో దగ్గో.. ఇలా ఏదో ఒక లక్షణంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు కలుషిత నీటితో.. దోమల దాడులతో వైరల్ ఫీవర్.. ప్రజలపై యుద్ధం చేస్తున్నాయి. ఫలితంగా ఆస్పత్రులు జ్వరబాధితులతో కిటకిటలాడుతున్నాయి. పలుచోట్ల సరైన మందు బిళ్లలు లేక.. పరీక్ష చేసే మిషన్లు లేక ప్రజలు అల్లాడుతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం విచారకరం. – నెట్‌వర్క్

- విజృంభిస్తున్న వైరల్ ఫీవర్స్, టైఫాయిడ్,డయేరియా
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత
- ఆఖరికి జలుబు, దగ్గు మందులూ కరువే..
- ప్రజలకు అందని ప్రభుత్వ వైద్యం



కడప రిమ్స్‌లో ఓపీ కోసం రిజిస్ట్రేషన్‌కు ప్రజల అవస్థలు



వైద్య సేవలు పొందుతున్న జ్వర పీడితులు

కడప రూరల్ (వైఎస్ఆర్ జిల్లా): ప్రజలపై జ్వరాలు విజృంభిస్తున్నాయి. వేసవి వెళ్లక ముందే వానలు కురవడం..వాతావరణంలో పెను మార్పులు రావడంతో జ్వరాలు చుట్టుముట్టాయి. దీనికి కలుషిత నీరు, అపరిశుభ్రత వాతావరణం తోడైంది. ఫలితంగా విష జ్వరాలు దాడి చేస్తున్నాయి. మరో వైపు వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యానికి సమస్యల జబ్బు పట్టింది. దీంతో సక్రమంగా వైద్య సేవలు అందకపోవడం ప్రజలకు శాపంగా మారింది.

- కమలాపురంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మౌళిక సదుపాయాలు పడకేశాయి. ఇక్కడ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించే కీలకమైన ఎక్స్ రే సౌకర్యం లేదు. ఆఖరికి ఈసీజీ సదుపాయం కూడా లేదు. ఈ రెండు రకాల పరీక్షలకు రోగులు కడపకు వస్తున్నారు. ఉచితంగా అందాల్సిన వైద్య సేవలకు డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ఆ ఆసుపత్రిలో నీటి సౌకర్యం లేకపోవడం దారుణం.
- ప్రొద్దుటూరు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో చక్కెర వ్యాధిని నియంత్రించే ఇన్సులిన్ ఇంజక్షన్‌లకు కొరత ఏర్పడింది. ప్రధానంగా ఇక్కడ ఉన్న జిల్లా ఆసుపత్రికి ఒక రోజుకు 800 నుంచి 1000 వరకు ఔట్ పేషెంట్స్ వస్తారు. అందులో దాదాపు 200 మంది వరకు జ్వరాలతో బాధపడే వారే ఉన్నారు.
- జమ్మలమడుగులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యులు సమయపాలన పాటించడం లేదు ఒక డ్యూటీ డాక్టర్ మాత్రం అందుబాటులో ఉంటారు. మిగతా వారు ఎప్పుడొస్తారో..ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఫేషియల్ అటెండెన్స్ మాత్రం వేసి, వెళ్లిపోతుంటారు. పులివెందుల ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రి గురించి ఎంత చెప్పినా తక్కువే. సకల వైద్య సౌకర్యాలతో ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించాల్సిన ఆసుపత్రి నిర్వీర్యంగా మారింది. ఇలా ప్రభుత్వ ఆసుపత్రులు పలు ఆరోపణలు ఎదుర్కొంటున్నాయి.

మందులకు కొరత



జిల్లాలో కడప నగరంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (పెద్దాసుపత్రి), ప్రొద్దుటూరులో జిల్లా ఆసుపత్రి, పులివెందులలో సర్వజన ఆసుపత్రి, వైద్య విధాన పరిషత్‌లో పోరుమామిళ్ల, మైదుకూరు, చెన్నూరు, బద్వేల్, సిద్దవటం, కమలాపురం, వేంపల్లెలో కలిపి మొత్తం 7 కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు ఉన్నాయి. ఈ ఆసుపత్రిల్లో దాదాపుగా అన్ని వ్యాధులకు వైద్య సేవలు అందించాలి. ఏదైనా పెద్ద జబ్బు, సమస్యతో కూడకున్నదైతే కడప రిమ్స్‌లో వైద్యం చేయాలి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో 51 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 24 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఒక ఆసుపత్రిలో 172 రకాల మందులను అందుబాటులో ఉంచాలి, 60 రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలి. అలాగే విలేజ్ హెల్త్ క్లినిక్‌లు 342 ఉన్నాయి. ఒక క్లినిక్ ద్వారా 108 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలి. చాలా వరకు ఆసుపత్రుల్లో మందులకు కొరత ఏర్పడింది. జ్వరం, జలుబు, దగ్గుకు మందులకు కొరత ఉంది అలాగే చక్కెర వ్యాధిని నియంత్రించే ఇన్సులిన్ ఇంజక్షన్‌లు అందుబాటులో లేవు. కొన్ని ఆసుపత్రులు ప్రక్కన ఉన్న ఆసుపత్రుల నుంచి లేని మందులను తెచ్చుకొని రోగులకు ఇస్తున్నారు. ఏమని అడిగితే...సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ నుంచి మందులు రావాల్సి ఉందని వైద్య సిబ్బంది చెపుతున్నారు.

జనవరి 1 నుంచి జూన్ 23 వరకు నమోదైన వ్యాధుల వివరాలు

వ్యాధులు	సంఖ్య
మలేరియా	03
డెంగ్యూ	76
చికున్‌గున్యా	6
డయేరియా	1,276
టైఫాయిడ్	261

అధికారిక లెక్కల కంటే వ్యాధిగ్రస్తుల సంఖ్య ఎక్కువ

ఇప్పుడిప్పుడే వ్యాధుల తీవ్రత పెరిగిపోతోంది. కలుషిత నీరు, అపరిశుభ్రత వాతావరణం తదితర కారణాల వల్ల వైరల్ ఫీవర్స్, టైఫాయిడ్ జ్వరాలు సంక్రమిస్తున్నాయి. జాగ్రత్తలు పాటించి, సరైన మందులు వాడితే ఒక వారంలో జ్వరం తగ్గుముఖం పడుతుంది. అలాగే డయేరియా కేసులు కూడా నమోదవుతున్నాయి. వివిధ రకాల వ్యాధులతో గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలతో ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల విశ్వాసం కోల్పోవడంతో చాలా మంది ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా చితికి పోతున్నారు. వ్యాధుల సంఖ్య అధికారిక లెక్కల కంటే అనధికారికంగా అధిక సంఖ్యలో ఉన్నట్లుగా వైద్యులు చెపుతున్నారు.

వైద్య రంగంపై పాలకులకు చిన్న చూపు

వైస్సార్‌సీపీ పాలనలో వైద్య రంగం విలసిల్లింది. ప్రభుత్వ ఆసుపత్రులు ఆధునిక సౌకర్యాలతో ఉండేవి. ఏ వ్యాధి వచ్చినా సత్వర వైద్య సేవలు లభించేవి. ఇప్పుడు టీడీపీ కూటమి పాలనలో ఆ రంగాలన్నీ కుదేలయ్యాయి. పాలకులు వైద్య రంగంపై చిన్న చూపు చూస్తోందనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

అదుపు తప్పిన చైతన్య స్కూల్ బస్సు



ఒక వైపు ఒరిగిన శ్రీ చైతన్య స్కూల్ బస్సు

రాయచోటి టౌన్ : రాయచోటిలోని శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన బస్సు అదుపు తప్పి ఒక వైపు ఒరిగిపోయింది. దీంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు. శనివారం రాయచోటికి చెందిన శ్రీ చైతన్య స్కూల్ బస్సు సుండుపల్లె నుంచి రాయచోటికి వస్తుండగా శిబ్యాల గ్రామం అనుంపల్లె సమీపంలో బస్సు బ్రేక్‌లు పని చేయకపోవడంతో ఒక్కసారిగా సైడు కాలువ వైపు ఒరిగిపోయింది. అక్కడ మరో చిన్న కాలువ ఉండటంతో అందులో ముందు వైపు టైర్ ఇరుక్కుపోవడంతో ఆగిపోయింది. ఈ కాలువ లేకుంటే సైడ్ కాలువలో పడి చిన్నారులకు గాయాలయ్యేవి. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఆవు-ఎద్దులను ఢీకొన్న కారు



ప్రమాదంలో మృతి చెందిన ఎద్దు

సిద్దవటం : మండలంలోని చాముండేశ్వరీపేట గ్రామం సెయింట్ ఆంథోనీ హైస్కూల్ సమీపంలో శనివారం ఆవు-ఎద్దులను కారు ఢీకొన్న ప్రమాదంలో ఆవు, ఎద్దు అక్కడికక్కడే మృతి చెందాయి. కడప- చెన్నై జాతీయ రహదారిలో ఈ ప్రమాదం జరిగింది. మేతకు రైల్వే ట్రాక్ అవతలికి వెళ్లి తిరిగి నేకనాపురం గ్రామానికి వెళ్లేందుకు ఆవు, ఎద్దు రోడ్డు దాటుతుండగా కడప నుంచి రాజంపేట వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఆవు, ఎద్దులను ఢీకొంది. ఈ ప్రమాదంలో నేకనాపురం గ్రామ పాడి రైతులు సుబ్బారెడ్డి, రవీంద్రారెడ్డిలకు చెందిన ఆవు, ఎద్దు మృతి చెందాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ మహమ్మద్‌రఫీ కారు డ్రైవర్ అబ్దుల్లాను విచారించారు.

గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం



బ్లేడుతో గొంతు కోసుకున్న నరేష్

మదనపల్లె రూరల్ : గొంతు కోసుకుని యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. రంగసముద్రం పంచాయతీ కుర్రావాండ్లపల్లెకు చెందిన నరేష్‌బాబు అలియాస్ భూషణ(27) స్థానికంగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం పూటుగా మద్యం తాగి వ్యక్తిగత సమస్యలతో మనస్తాపం చెంది బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. బి.కొత్తకోట పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

దళితుల రోడ్డును ధ్వంసం చేశాడు



టీడీపీ నేత ధ్వంసం చేసిన రోడ్డును పరిశీలిస్తున్న ఎస్ఐ చిన్న పెద్దయ్య



ధ్వంసం చేసిన దారిలో ఇబ్బంది పడుతూ వెళుతున్న దళితులు

చాపాడు మండలం తిప్పిరెడ్డిపల్లెలో టీడీపీ నేత దుశ్చర్య

చాపాడు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల క్రితం.. 30 ఏళ్లుగా సిమెంట్ రోడ్డుకు నోచుకోని మండలంలోని తిప్పిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీ(దళితవాడ)కి మెయిన్ రోడ్డు నుంచి 2019–20లో 14వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ పథకం కింద రూ.4లక్షలతో ప్రభుత్వం సిమెంట్ రోడ్డు నిర్మించింది. ఆ సమయంలో రోడ్డు నిర్మాణం చేపట్టే స్థలం తమదని మండలంలోని అనంతపురం గ్రామానికి చెందిన టీడీపీ నేత నందిమండలం మల్లికార్జునరెడ్డి అడ్డుపడ్డాడు. ఎస్సీ కాలనీ లేఅవుట్‌లో దారి స్థలం ఇదేనని అధికారులు తేల్చడంతో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి ఐదేళ్ల పాటు ఈ రోడ్డు నిర్మాణంపై ఎలాంటి సమస్యలు తలెత్తలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత టీడీపీ నేత మల్లికార్జునరెడ్డి శనివారం ఉదయం తన అనుచరులతో వచ్చి జేసీబీతో 40 కుటుంబాల వారు నివసిస్తున్న దళితవాడకు వెళ్లే సిమెంట్ రోడ్డు పూర్తిగా తొలగించి ధ్వంసం చేయించాడు. ఈ సమయంలో దళితవాడకు చెందిన వారందరూ ఉపాధి హామీ పనులకు వెళ్లగా అక్కడ ఉండే కొంత మంది రోడ్డు తొలగింపును అడ్డుకునేందుకు ప్రయత్నించగా తమను బెదిరించారని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న దళితులందరూ ఇంటికి రాగా అప్పటికే వారి ఇళ్లకు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసం అయి ఉంది. దీంతో ఫోన్ల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరి సంఘటన స్థలాన్ని పరిశీలించి దళితులను విచారించారు. ఈ రోడ్డును టీడీపీ నేత మల్లికార్జునరెడ్డి తొలగించినట్లు వారు ఎంపీడీఓ వీరకిషోర్‌కు తెలిపారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న ఎస్ఐ చిన్న పెద్దయ్య సంఘటనా స్థలం వద్దకు చేరుకుని రోడ్డు తొలగింపును పరిశీలించారు. ఈ చర్యను అడ్డుకోబోగా అనంతపురం, ఓబాయపల్లె, నక్కలదిన్నె గ్రామాలకు చెందిన టీడీపీ వర్గీయులు చంపుతామని బెదిరించి భయాందోళనకు గురి చేసినట్లు వారు ఎస్ఐ దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డు తొలగింపు ఘటన కారకులపై చర్యలు తీసుకోవాలని స్థానిక దళితులు ఎస్ఐ చిన్న పెద్దయ్య, డిప్యూటీ తహసీల్దారు కృష్టారెడ్డికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ స్థలంపై తనకు హక్కు ఉందని కోర్టులో దీనిపై కేసు నడుస్తోందని స్టే కూడా ఉందని మల్లికార్జునరెడ్డి చెబుతున్నాడు.

ఎంపీడీఓ ఏమన్నారంటే..

తిప్పిరెడ్డిపల్లె దళితవాడకెళ్లే రోడ్డును టీడీపీ నేత తొలగించడంపై ఎంపీడీఓ వీర కిషోర్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వ నిధులతో వేసిన రోడ్డును తొలగించడం చట్టరీత్యా నేరమన్నారు. రోడ్డు తొలగింపు, స్థల సమస్యపై రెవెన్యూ అధికారులతో కలసి సమగ్ర విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

టీడీపీ నేత మల్లికార్జునరెడ్డికి ఎలాంటి సంబంధం లేదు : దళితులు

30 ఏళ్ల క్రితం ఊరి బయట ఉన్న తాము ఇళ్లు నిర్మించుకునేందుకు పామిడి బుడ్డయ్య కుమారుడు వీరయ్య నుంచి ఇంటింటికి చందాలు వేసుకుని 70 సెంట్ల స్థలం కొనుగోలు చేశామని దళితులు చెబుతున్నారు. ఈ క్రమంలో తమ కాలనీ పెద్ద మనిషి గయన్నతో పాటు మరికొందరు పెద్ద మనుషుల నిర్ణయంతో ఊర్లో పెద్ద మనిషిగా ఉన్న నందిమండలం వీరారెడ్డి పేరుతో స్థలం రాయించుకున్నామన్నారు. అప్పటి నుంచి వీరారెడ్డి పేరు మీదనే స్థల పత్రాలు ఉన్నాయన్నారు. వీరారెడ్డి తమ్ముడి కుమారుడు అయిన పడమర అనంతపురం గ్రామంలో ఉన్న టీడీపీ నేత మల్లికార్జునరెడ్డి ఈ స్థలం తమ పెదనాన్నదని తనకు హక్కు ఉందని వస్తున్నాడని, గతంలో అధికారులు చెప్పినా వినకుండా ఇప్పుడు ఇలా దౌర్జన్యంగా రోడ్డును తొలగించాడని దళితులు వాపోతున్నారు.

సమస్యలు పరిష్కరించేవరకు

పనులు జరగనివ్వం

- టెయిలింగ్ పాండ్ వద్ద పనులు నిలిపివేయాలని గ్రామస్తుల నిరసన
- యురేనియం అధికారులు చర్చించినా పట్టువీడని బాధితులు
- నిలిచిపోయిన పనులు



గ్రామస్తులతో చర్చిస్తున్న యురేనియం అధికారులు

వేముల : తమ సమస్యలు పరిష్కరించేవరకు టెయిలింగ్ పాండ్ వద్ద ఎలాంటి పనులు జరగనివ్వమని.. సమస్యలపై స్పష్టత ఇచ్చాకే పనులు చేసుకోవాలని కె.కె.కొట్టాల గ్రామస్తులు యురేనియం అధికారులకు సూచించారు. శనివారం ప్రొక్లెయిన్ల సహాయంతో పనులు చేపట్టేందుకు యురేనియం అధికారులు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న కె.కె.కొట్టాల గ్రామస్తులు టెయిలింగ్ పాండ్ వద్దకు చేరుకుని పనులు చేయవద్దని నిరసనకు దిగారు. దీంతో యురేనియం అధికారులు బాధితులతో చర్చించినా వారు అంగీకరించలేదు. కాగా యురేనియం ముడి పదార్థాన్ని శుద్ధి చేయగా, వచ్చే వ్యర్థాలను కె.కె.కొట్టాల సమీపంలోని టెయిలింగ్ పాండ్‌కు తరలిస్తున్నారు. అయితే టెయిలింగ్ పాండ్ వ్యర్థాలతో నిండే స్థాయికి చేరుకుంది. దీంతో యురేనియం అధికారులు రోజుకు 3వేల టన్నుల ముడి పదార్థాన్ని శుద్ధి చేయాల్సి ఉన్నా.. టెయిలింగ్ పాండ్ తొందరగా నిండిపోయే ప్రమాదం ఉండటంతో ప్రస్తుతం రోజుకు 1500 టన్నులు మాత్రమే ముడి పదార్థాన్ని శుద్ధి చేస్తున్నారు. ఈ లెక్కన ముడి పదార్థాన్ని శుద్ధి చేసిన నాలుగైదు నెలల్లో టెయిలింగ్ పాండ్ నిండుతుందని యురేనియం అధికారులు చెబుతున్నారు. అంతేకాక ఈ లోపు భారీ వర్షాలు కురిస్తే టెయిలింగ్ పాండ్ వర్షపు నీటితో పొర్లిపాయే ప్రమాదం ఉంది. దీంతో యురేనియం అధికారులు ప్రొక్లెయిన్ సహాయంతో టెయిలింగ్ పాండ్ వద్ద మట్టిని పోసే పనులను చేయాలని నిర్ణయించారు. దీంతో ప్రొక్లెయిన్లను సిద్ధంగా ఉంచుకుని పనులు ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ఈ లోపు ఈ సమాచారం కె.కె.కొట్టాల గ్రామస్తులకు తెలియడంతో గ్రామస్తులు టెయిలింగ్ పాండ్ వద్దకు చేరుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించకుండా పనులు చేయడానికి వీల్లేదనడంతో నిరసనకు దిగారు. యురేనియం వ్యర్థాలతో ఇప్పటికే తీవ్రంగా నష్టపోయామని వాపోయారు. యురేనియం వ్యర్థాలు దుమ్ము, ధూళి గాలి ద్వారా గ్రామం వైపు రావడంతో తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నామని వాదించారు. కిడ్నీ వ్యాధులు, గర్భస్రావాలు, చర్మ వ్యాధులు, క్యాన్సర్ వంటి వ్యాధులు సోకుతున్నాయని యురేనియం అధికారులకు విన్నవించారు. టెయిలింగ్ పాండ్ పనులు జరగాలంటే తమ సమస్యలను పరిష్కరించాల్సిందేనని పట్టుబట్టారు. రాత్రికి రాత్రే ప్రొక్లెయిన్లను టెయిలింగ్ లోనికి పంపి పనులు చేపట్టడంపై గ్రామస్తులు యురేనియం అధికారులను నిలదీశారు. ఇళ్లు, పొలాలు తీసుకుని పరిహారంతోపాటు ఉద్యోగావకాశాలు కల్పించాలని తర్వాతనే పనులు చేసుకోవాలని గ్రామస్తులు తేల్చి చెప్పారు. యురేనియం అధికారులు నవీన్‌కుమార్ రెడ్డి, టెయిలింగ్ పాండ్ ఇన్‌ఛార్జి నాగరాజులు గ్రామస్తులతో చర్చించారు. మీ సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎలాంటి ఆందోళన చెందవద్దని గ్రామస్తులకు నచ్చజెప్పారు. మీ ప్రకారమే అన్ని జరుగుతాయని, అయితే ఇందుకు సమయం కావాలని, అప్పటివరకు పనులు చేసుకునేందుకు సహకరించాలని గ్రామస్తులకు సూచించారు. ఇందుకు గ్రామస్తులు తమ సమస్యలపై హామీ ఇచ్చిన తర్వాతనే పనులు చేసుకోవాలని, అంతవరకు టెయిలింగ్ పాండ్‌లో పనులు చేపట్టవద్దని, పనులు చేస్తే ధర్నాకు వెనుకాడమని హెచ్చరించారు. దీంతో టెయిలింగ్ పాండ్ వద్ద పనులు నిలిచిపోయాయి.

బాలిక హత్య కేసులో పోలీసుల తాత్సారం



డీఎస్పీతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

జమ్మలమడుగు : గండికోటలో మైనర్ బాలికను హత్యచేసిన నిందితులెవరో పోలీసులకు తెలిసినా వివరాలను వెల్లడించడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని విప్లవ రచయితల సంఘం నాయకురాలు వరలక్ష్మి ప్రశ్నించారు. శనివారం ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆమె ఎర్రగుంట్ల మండలం హనుమనగుత్తిలో బాధితురాలి తల్లిదండ్రులతో, బాలికను బైకుపై తీసుకెళ్లిన లోకేష్ తల్లితో మాట్లాడారు. అనంతరం డీఎస్పీ వెంకటేశ్వర్లును కలసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనర్ బాలిక హత్య జరిగిందని తెలిసిన వెంటనే లోకేష్‌ను పోలీసులు అదుపులోనికి తీసుకున్నారన్నారు. ఐదురోజులు గడిచినా ఇంతవరకు అతన్ని కోర్టు ముందు హాజరు పరచలేదన్నారు. నిందితులను గుర్తించేందుకు విచారణ చేస్తున్నామంటూ పోలీసులు కాలయాపన చేస్తున్నారనే విషయం స్పష్టమవుతోందన్నారు. నిందితుల వివరాలు ఎందుకు దాచిపెడుతున్నారో తమకు అర్థం కావడం లేదన్నారు. సంఘటన స్థలాన్ని కూడా తాము పరిశీలించామని, ఆ ప్రాంతం పూర్తిగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయిందన్నారు. గండికోటలో టోల్‌గేట్ పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారే తప్ప ఎక్కడా సెక్యూరిటి గాని సీసీ కెమెరాలు గాని లేవన్నారు. ఈ ప్రాంతానికి విదేశీ పర్యాటకులు సైతం ఎక్కువ సంఖ్యలో వస్తుంటారని, ఇలాంటి సంఘటనలు జరిగితే విదేశాల్లో సైతం మన పరువు పోతుందన్నారు. ఈ ప్రాంతంలో సెక్యూరిటీ పెంచి, పర్యాటకులకు భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నాయకులు, న్యాయవాదులు, మహిళా సంఘాలు, సీపీఎం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రవర్తన మార్చుకోలేదని భార్యను కడతేర్చాడు

- మృతదేహాన్ని గోనె సంచిలో తీసుకెళ్లి ఎద్దడుగు కనుమలో పడేశాడు
- పోలీసుల అదుపులో భర్త గోపాల్



సుజాత(ఫైల్)



భర్త గోపాల్(ఫైల్)



సుజాత మృతదేహం వద్ద పరిశీలిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

చాపాడు : ప్రవర్తన బాగా లేకపోవడంతో పద్ధతి మార్చుకోవాలని రెండేళ్లుగా భర్త చెబుతూ వస్తున్నాడు .. భార్య వివాహేతర సంబంధంపై పలుమార్లు పోలీసు స్టేషన్‌లో పంచాయితీలు జరిగాయి. అయినా ఆమెలో మార్పు రాకపోవడంతో భార్యను హతమార్చి శవాన్ని గోనె సంచిలో తీసుకెళ్లి మైదుకూరు – పోరుమామిళ్ల మధ్య గల ఎద్దడుగు కనుమలో పడేసిన ఘటన శనివారం మండలంలోని చియ్యపాడులో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు..

చాపాడు మండలం చియ్యపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల సుజాత(40)ను ఆమె భర్త నల్లబోతుల గోపాల్ ఈ నెల 17న గొంతు నులిమి హత్య చేశాడు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్‌గా ఉంటున్న గోపాల్ తన అక్క పార్వతమ్మ కూతురు అయిన సుజాతను 20 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. గత రెండేళ్ల క్రితం నుంచి తన ఇంటి నిర్మాణం చేస్తున్న చియ్యపాడు దళితవాడకు చెందిన బేల్దారి బాబుతో సుజాతకు పరిచయం ఏర్పడి అది వివాహేతర సంబంధంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న భర్త గోపాల్ పలు సార్లు భార్య సునీతను పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించాడు. అయినప్పటికీ వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ పంచాయితీ పలు సార్లు చాపాడు పోలీసు స్టేషన్‌కు సైతం వచ్చింది. ఇదే విషయంలో బాబుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు కూడా తరలించారు. అయినప్పటికీ సుజాత, బాబు వివాహేతర సంబంధం కొనసాగుతుండడంతో ఈ నెల 17న రాత్రి గోపాల్, సుజాత గొడవ పడ్డారు. తన మాట వినలేదనే కారణంతో రాత్రి 11 గంటల ప్రాంతంలో గోపాల్ తన భార్యను గొంతు నులిమి చంపేశాడు. ఈ విషయం బయటికి పొక్కకుండా సుజాత శవాన్ని గోపాల్ గోనే సంచిలో కట్టుకుని తన బైక్‌లో మైదుకూరు – పోరుమామిళ్ల రహదారి మధ్యలో గల ఎద్దడుగు కనుమలోని ఓ ముళ్లపొద గుంతలో పడేశాడు. గ్రామంలోనే ఉన్న సుజాత తల్లి పార్వతమ్మ తన కూతురు కన్పించలేదని పోలీసుకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ చిన్న పెద్దయ్య ఈ ఘటనపై గోపాల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా స్వయంగా తానే సుజాతను హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. ఎద్దడుగు కనుమలో పడేసిన శవం వద్దకెళ్లి డీఎస్పీ రాజేంద్రప్రసాద్, రూరల్ సీఐ, ఎస్ఐ పరిశీలించారు. సుజాత మృతదేహం కుళ్లిపోవడంతో బయటికి తీసేందుకు వీలు కాక అక్కడే పంచానామా నిర్వహించారు. పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ తెలిపారు.

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

- ద్విచక్రవాహనంపై వెళుతుండగా కారుతో ఢీకొట్టి రాడ్లతో దాడి చేసిన వైనం
- ఇద్దరికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం
- కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలింపు



దాడి వివరాలను అడిగి తెలుసుకుంటున్న డీఎస్పీ, సీఐ

తొండూరు : అధికార టీడీపీలో వర్గ విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో తొండూరు మండలం ఇనగలూరు గ్రామంలో అధికార పార్టీకి చెందిన దస్తగిరిరెడ్డి (బాబురెడ్డి), అదే పార్టీకి చెందిన బాల ఓబుళరెడ్డిల మధ్య ఉపాధి హామీలో చేసిన బిల్లుల విషయమై ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. ఈ నేపథ్యంలో దస్తగిరిరెడ్డి తమకు బిల్లులు రాకుండా అడ్డుకున్నారని బాల ఓబుళరెడ్డి వర్గీయులు ఈ ఏడాది జనవరి మాసంలో దస్తగిరిరెడ్డిపై దాడి చేశారు. దీంతో అప్పటి నుంచి బాల ఓబుళరెడ్డి వర్గీయులు జైలు నుంచి వచ్చిన తర్వాత ఇనగలూరు గ్రామానికి వెళ్లకుండా బయట తిరిగేవారు. నెల రోజుల క్రితం పోలీసులు ఇరు వర్గాల వారికి కౌన్సిలింగ్ ఇచ్చి ఎలాంటి ఘర్షణలకు దిగకుండా అందరూ ఐకమత్యంగా ఉండాలని సూచించారు. దీంతో బాల ఓబుళరెడ్డి వర్గీయులు ఇనగలూరు గ్రామంలోకి వెళ్లి పనులు చేసుకుంటుండేవారు. శనివారం బాల ఓబుళరెడ్డి కుమారులు సమరసింహారెడ్డి, హరికిశోర్‌రెడ్డిలు ద్విచక్రవాహనంపై ఇనగలూరు నుండి పులివెందులకు వస్తుండగా సైదాపురం బస్టాప్ దాటగానే వెనుకవైపు నుంచి దస్తగిరిరెడ్డితోపాటు మరికొంతమంది కారులో వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి సమర సింహారెడ్డి, హరికిశోర్‌రెడ్డిలపై రాడ్లతో దాడి చేశారు. దీంతో వారి తలకు బలమైన రక్తపు గాయాలతో పాటు కాలు విరిగినట్లు తెలిసింది. దాడి జరిగే సమయంలో కొంతమంది స్థానికులు వచ్చి గాయపడిన వారిని 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సమరసింహారెడ్డి, హరికిశోర్‌రెడ్డిలను పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్, సీఐ వెంకటరమణలు దాడి జరిగిన సంఘటన గురించి ఆరా తీశారు. అక్కడి వైద్యులు చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండటంతో కడపకు రెఫర్ చేశారు. ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై పులివెందుల రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ ఘన మద్దిలేటిలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బైక్ అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన వలిగేశ్వర్

మదనపల్లె రూరల్ : బైక్ అదుపుతప్పి ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని సీటీఎం పంచాయతీ మిట్టపల్లెకు చెందిన గంగులప్ప కుమారుడు వలిగేశ్వర్(27) డిష్ యాంటెన్నా పనులు చేస్తూ ఉంటాడు. ఈ క్రమంలో శనివారం స్నేహితుడైన ప్రకాష్(25)తో కలిసి ద్విచక్ర వాహనంలో పనుల నిమిత్తం పుంగనూరు వెళ్లాడు. పుంగనూరు సమీపంలో వాహనానికి కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స కోసం మెరుగైన చికిత్స కోసం మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రామసముద్రం మండలంలో..



గాయపడిన కుమార్

రామసముద్రం : ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయి ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన రామసముద్రం మండలంలో శనివారం సాయంత్రం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పలమనేరు దగ్గర ఏడూరుకు చెందిన ఆసిఫ్, కుమార్ లు రామసముద్రం నుంచి పుంగనూరు వైపు వెళ్తుండగా మినికి వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో కుమార్ కు ముక్కు దగ్గర, ఆసిఫ్ కు చేతిపైన తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ప్రసాద్, వెంకటరమణ సంఘటన స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వరుస ఫిర్యాదులపై జిల్లా రిజిస్ట్రార్ విచారణ



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారిస్తున్న జిల్లా రిజిస్ట్రార్

కలికిరి : కలికిరి సబ్ రిజిస్ట్రార్‌పై ఇటీవల వరుస ఫిర్యాదులు అందడంపై స్పందించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా రిజిస్ట్రార్ ఏ.వి.ఆర్. మూర్తి శనివారం స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ పార్థసారథిపై కొందరు డాక్యుమెంటు రైటర్లే వరుసగా పీజీఆర్ఎస్, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే తనపై వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులకు సబ్ రిజిస్ట్రార్ వివరణ ఇచ్చుకున్నారు. మరోసారి నేరుగా జిల్లా రిజిస్ట్రార్ విచ్చేసి ఫిర్యాదుదారులను విచారించారు. అయితే ప్రజలు, రైతులు కాకుండా డాక్యుమెంటు రైటర్లే ఫిర్యాదులు చేస్తుండటంపై విస్మయం వ్యక్తం చేసిన ఆయన సబ్ రిజిస్ట్రారు సమక్షంలోనే వారిని విచారించారు. సబ్ రిజిస్ట్రార్‌పై వచ్చిన ఆరోపణలపై అక్కడికక్కడే వివరణ అడిగారు. సుమారు రెండు గంటల పాటు విచారించిన ఆయన ఫిర్యాదులో వచ్చిన ప్రతి అంశాన్ని పరిశీలించారు. సమయాభావం వల్ల మరోమారు విచారణ చేస్తామన్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

పెద్దమండ్యం : పోక్సో కేసులో యువకుడిని శనివారం అరెస్టు చేసినట్లు ములకలచెరువు సీఐ లక్ష్మన్న తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెలిగల్లు గ్రామం గురికివాండ్లపల్లెకు చెందిన బాలిక (15) పదో తరగతి చదువుతోంది. ఈ నెల 6వ తేదీన ఇంటి వద్ద బాలిక ఉండగా గాలివీడుకు చెందిన మల్లెల రామక్రిష్ణ అత్యాచారానికి పాల్పడ్డాడు. సంఘటనపై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వెలిగల్లు సచివాలయం వద్ద ఉండగా నిందితుడిని అరెస్ట్ చేసి తిరుపతి జువైనల్ కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన ఇటుకల బట్టీ కార్మికుడు

కురబలకోట : ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం కురబలకోట మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు..తెట్టు గ్రామం మండ్యం వారిపల్లె వద్ద ఇటుకల బట్టీలో మదనపల్లెకు చెందిన అలీ (42) అనే వ్యక్తి పని చేస్తున్నాడు. ఇతను సమీపంలో ఉన్న నీటి కుంటలో పడి మృతి చెంది ఉండగా స్థానికులు కనుగొన్నారు. ఇతనికి వాయువు కన్పిస్తుంది. ఆరోగ్యం కూడా బాగాలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.